

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శనివారం, 13 సెప్టెంబరు 2025
3


9తేదీన ప్రజాభవన్ ముట్టడిలో దినసరి కార్మికులు (ఫైల్)

కార్మికుల డిమాండ్లు ఇవే..

దినసరి కార్మికులు పలు రకాల డిమాండ్లు తీర్చాలని సమ్మె బాట పట్టారు. ఈనెల 9న హైదరాబాద్‌లో ధర్నా చేయగా.. ఆ తర్వాత ప్రభుత్వ ప్రతినిధులతో చర్చలు విఫలం కావడంతో కార్మికులు సమ్మెకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో కార్మికుల డిమాండ్లు ఇవీ..

- 212 జీవోను సవరించి 2014 నాటికి 5 సంవత్సరాల సర్వీస్ ఉన్నవారిని పర్మినెంట్ చేయాలి.
- అవుట్ సోర్సింగ్ విధానాన్ని నిలిపివేయాలి.
- జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలి.
- పెండింగ్ వేతనాలు చెల్లించేందుకు ట్రెజరీలకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలి.
- గత సమ్మెకాలపు వేతనాలు ఇవ్వాలి.
- కొత్త మెనూ వల్ల పెరిగిన పనిభారానికి అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలి.
- పూర్తికాలం పనిచేస్తున్న కార్మికులకు పూర్తి వేతనాలు ఇవ్వాలి.
- మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులను దినసరి కార్మికులుగా తీసుకోవాలి.
- రెండు జతల దుస్తులు ఇవ్వాలి. 12నెలల గత వేతనాలు చెల్లించాలి.
- రూ.10లక్షల ప్రమాద బీమా కల్పించాలి.
- రిటైర్‌మెంట్ తరువాత రూ.5లక్షలు ఇవ్వాలి. మట్టి ఖర్చులకు రూ.50వేలు ఇవ్వాలి.
- వేతనంతో కూడిన వారాంతపు సెలవులు ఇవ్వాలి.

గిరిజన ఆశ్రమాల్లో కార్మికుల సమ్మెబాట

- ఆందోళన బాటలో 'దినసరి' వర్కర్లు
- 11 రకాల సమస్యలు పరిష్కరించాలంటూ విధులకు దూరం
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 515 మంది సమ్మెలోకి..
- ఆశ్రమాల్లో వంట చేసిన వార్డెన్లు, ఉపాధ్యాయులు

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలంటూ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హస్టళ్లలో పని చేస్తున్న దినసరి (డైలీవేజ్) కార్మికులు శుక్రవారం నుంచి నిరవధిక సమ్మెబాట పట్టారు. వేతనాల పెంపుతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నా... పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదంటూ కార్మికులు ఆందోళన చేస్తున్నారు. ఆశ్రమాల్లో వంటతో పాటు వివిధ రకాల పనులు చేసే దినసరి కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో.. విద్యార్థులకు ఆహారాన్ని వండే విషయంలో ఇబ్బందులు తప్పలేదు. సమ్మె మొదటిరోజే ఆశ్రమాల్లో వార్డెన్లు, ఉపాధ్యాయులతో పాటు కొంతమంది రెగ్యులర్ సిబ్బంది కలిసి వంట చేసి చిన్నారులకు ఆహారాన్ని అందించారు. ముున్ముందు సమ్మె నిరవధికంగా కొనసాగితే మాత్రం సమస్య మరింత జటిలమయ్యే పరిస్థితులు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలో 515 మంది

గిరిజన విద్యార్థుల సంక్షేమానికి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ప్రభుత్వం పలు ఆశ్రమాలు, వసతిగృహాలను నిర్వహిస్తోంది. ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్థులు వసతి గృహాలు, హస్టళ్లలో ఉంటూ విద్యనభ్యసిస్తున్నారు. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 50గిరిజన ఆశ్రమ పాఠశాలలు, 14 వసతి గృహాలు, 22 పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి. ఇక్కడ వేలాదిమంది చిన్నారులు చదువుతున్నారు. ఆయా సంస్థల పరిధిలో వంట చేయడం, పాఠశాలను పరిశుభ్రంగా ఉంచడం, కార్యాలయంలో వివిధ (మిగతా 4వ పేజీలో)


అశ్వారావుపేట మండలం సున్నంబట్టిలో కార్మికుల సమ్మె

నిర్మించారు.. వదిలేశారు!

- ఇదీ హౌసింగ్ బోర్డు భవనాల పరిస్థితి
- వినియోగంలోకి తీసుకురావాలని ప్రజల డిమాండ్


నిరుపయోగంగా సింగిల్ బెడ్‌రూం అపార్టుమెంట్ భవనాలు

ఖమ్మం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో మధ్య తరగతి, ఆపై వర్గాల వారికి తక్కువ ధరకే ఇళ్ల ఇచ్చేందుకు గతంలో హౌసింగ్‌బోర్డు ఆధ్వర్యంలో పలు జిల్లాల్లో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చట్టారు. ఈ క్రమంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఖమ్మం- బోనకల్ రోడ్డులో ప్రభుత్వం 40 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వ ధరకు ఓ ప్రైవేటు సంస్థకు విక్రయించింది. ఆ ప్రక్రియలో భాగంగా 2ఎకరాల్లో 121మందికి సింగిల్ బెడ్‌రూం అపార్టుమెంట్లు నిర్మించి ఇవ్వాలని నిబంధన విధించింది. దీంతో ప్రైవేటు నిర్మాణ సంస్థ 40ఎకరాల్లో ఇళ్లు నిర్మించడం, వాటిని విక్రయించడం చకచకా జరిగిపోయింది. అలాగే పేద వర్గాలకు కూడా తక్కువ ధరకు విక్రయించేందుకు 120 ప్లాట్లతో అపార్టుమెంట్ల తరహాలో నిర్మించారు. వాటిని కేవలం 500చదరపు అడుగుల్లో సింగిల్‌బెడ్‌రూం, కిచెన్, హాల్‌గా నిర్మించారు. ఇవి నిర్మించి దశాబ్ద కాలమైంది. కానీ ఇప్పటివరకు వీటిని చిరుద్యోగులు, పేదలకు కేటాయించకపోవడంతో.. అవి కాస్త ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. ఇప్పుడు వీటి పర్యవేక్షణను కూడా ఎవరూ పట్టించుకోవడంలేదు. సుమారు రెండు ఎకరాల్లో నిర్మించిన సింగిల్ బెడ్‌రూం ప్లాట్లు చిరు ఉద్యోగులకు తక్కువ ధరకు విక్రయించడమా!? లేక పేదలకు కేటాయించడమా!? అన్నదానిపై యంత్రాంగం కూడా స్పష్టతను ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. ఖాళీగా ఉన్న ఆ భవనాలను గుర్తుతెలియని వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తుండటంతో.. సమీప కాలనీ వాసులు భయపడుతున్నారు. హౌసింగ్ బోర్డు అధికారులు వచ్చి చూసి వెళ్లడం తప్ప.. వీటిని వినియోగంలోకి తెచ్చేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు ఖమ్మం కార్పొరేషన్‌లోని బోనకల్ రోడ్డులో శ్రీరాంహిల్స్ సమీపంలో ఉన్న హౌసింగ్‌బోర్డు కాలనీపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఇటీవల టెండర్ల ద్వారా రాజీవ్ స్వగృహకు మోక్షం కలిగించిన నేపథ్యంలో ఈ హౌసింగ్ బోర్డు భవనాలను కూడా పేదలకు కేటాయించడమా!? లేక విక్రయించడమా !? అన్న విషయమై అధికారులు నిర్ణయం తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

16 నుంచి ఖమ్మం రీజియన్‌లో
యాత్రాదానం ప్రారంభం


ఆర్ఎం సరిరాం

ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీజీఎస్ఆర్టీసీ సామాజిక బాధ్యతలో భాగంగా వినూత్నమైన సేవా కార్యక్రమం యాత్రాదానాన్ని ప్రారంభించిందని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సరిరాం తెలిపారు. ఈ కార్యక్రమం మంగళవారం నుంచి ఖమ్మం రీజియన్‌లో అందుబాటులోకి వస్తుందని తెలిపారు. వ్యక్తుల పుట్టిన రోజులు, వివాహ వార్షికోత్సవాలు, పండుగలు, ఇతర శుభదినాలు వంటి ఆనందదాయకమైన సందర్భాల్లో అనాథలు, నిరాశ్రయులైన వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద విద్యార్థులను ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలు, విహారయాత్రలకు తీసుకెళ్లడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. ఈ మహోన్నత సేవలో భాగస్వాములవ్వదలచిన వారు వారి యొక్క సంతోషకరమైన రోజుల్లో ఈ కార్యక్రమం ద్వారా ఇతరుల్లోనూ ఆనందం కలిగించవచ్చని, తాము కోరుకునే శుభదినాన టీజీఎస్ఆర్టీసీకి విరాళం అందజేసి, ఆ విరాళం ఆధారంగా ఏసీ, సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సుల ద్వారా విహారయాత్రలను ఏర్పాటు చేయించుకోవచ్చునని తెలిపారు. తాము జరుపుకొనే శుభదినాన తగిన మొత్తాన్ని సంస్థకు విరాళంగా అందజేయడం ద్వారా వారికి టీజీఎస్ఆర్టీసీ బస్సు సదుపాయం కల్పిస్తుందని, యాత్రాదానం కార్యక్రమ నిర్వహణ కోసం పేరుతో ప్రత్యేక నిధిని సంస్థ ఏర్పాటు చేసిందన్నారు. వ్యక్తులతో పాటు ప్రజా ప్రతినిధులు, కార్పొరేట్ సంస్థలు, (మిగతా 4వ పేజీలో)


మల్లెమడుగులో సీలింగ్ భూమికి హద్దులు ఏర్పాటు చేసిన ఆర్డీవో నర్సింహారావు, తహసీల్దారు సైదులు తదితరులు

ఈ భూమి కోర్టు పరిధిలో ఉంది!

మల్లెమడుగు సీలింగ్ భూములకు హద్దులు

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి):'ఈ భూమి కోర్టు పరిధిలో ఉంది.. ఎవ్వరికీ ప్రవేశం లేదు.. ఎవరైనా అతిక్రమిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటాం..' అంటూ విలువైన ప్రభుత్వభూమికి రెవెన్యూ అధికారులు హద్దులు ఏర్పాటు చేశారు. గత దశాబ్దకాలంగా ఖమ్మం అర్బన్ మండలం మల్లెమడుగు రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 194, 195, 198లో 29ఎకరాల సీలింగ్ భూమి ఉంది. దీనికి హక్కులు తమకున్నాయంటూ ఒకరు.. ఈ భూమికి పట్టా ఉందని మరొకరు.. ఇలా ముగ్గురు వ్యక్తులు కోర్టును ఆశ్రయించారు. కోర్టులో ఉన్నప్పటికీ.. ఆ భూమిలోకి వెళ్లేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో.. శుక్రవారం ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, తహసీల్దార్ సైదులు ఆధ్వర్యంలో ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఇది సీలింగ్ భూమి అని, గతంలోనే పేదలకు ఇచ్చారని కొందరు, ఇది ప్రైవేటుభూమి అని, తమకు సర్వహక్కులు ఉన్నాయని మరికొందరు కోర్టును ఆశ్రయించడంతో ప్రస్తుతం వివాదం కొనసాగుతోంది. ఈ భూమిని సొంతం చేసుకునేందుకు ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తుండడంతో.. శుక్రవారం ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, తహసీల్దార్ సైదులు ఆధ్వర్యంలో సరిహద్దులను నిర్ణయించి భూముల్లోకి ఎవరూ రావొద్దంటూ ఆంక్షలు విధించారు. కోర్టు పరిధిలో ఉన్న నేపథ్యంలో ఎవరూ ప్రవేశించవద్దని, అతిక్రమిస్తే కోర్టుపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో సర్వేలో ప్రభుత్వ భూమి అని తేలడంతో ప్రభుత్వం తరఫున నివేదిక ఇవ్వడం జరిగిందని తహసీల్దార్ సైదులు తెలిపారు. నేపథ్యంలో హద్దులు ఏర్పాటు చేసి లోపలికి వెళ్లకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి భూమిని స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు.

జిల్లాలో డిజిటల్ క్రాప్ సర్వే షురూ

ఆన్‌లైన్‌లో నిక్షిప్తమవుతున్న మీ పంటలు

కొత్తగూడెం అర్బన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గత నెల రోజుల క్రితం ప్రారంభమైన డిజిటల్ క్రాప్ సర్వే క్రమంగా ముందుకు సాగుతోంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు సర్వే చేసి క్షేత్రస్థాయిలో పంటల వివరాలను తెలుసుకుని ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. జిల్లాలో వానాకాలం సీజన్ అలస్యంగా ప్రారంభమైంది. సర్వే తీరుతెన్నులను పురోగతిని వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి సమీక్షిస్తున్నారు. నవంబర్ నెలాఖరుకు ఈ సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. గత సంవత్సరం డిజిటల్ క్రాప్ సర్వేకు ఏఈవోలు విస్తీర్ణం అధికంగా ఉందని, పని ఒత్తిడి కలుగుతుందని నిరసనలు వ్యక్తం చేసి సహాయ నిరాకరణ చేపట్టారు. ఈ ఏడాది సమస్యలు తలెత్తకుండా సక్రమంగా సర్వే పూర్తిచేసేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. స్థానికంగా ఏ రకమైన పంటలు సాగు చేస్తున్నారు..? పంటలకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు తీసుకునే కార్యాచరణకు ఈ కార్యక్రమం దోహద పడుతుందని, ప్రకృతి విపత్తుల వల్ల ఖచ్చితమైన పంటల నష్టాలను అంచనా వేసుకునే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. జిల్లా అంతటా పండిస్తున్న పంటల సాగును డిజిటలీకరణ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన "డిజిటల్ క్రాప్ సర్వే"ను జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు నేతృత్వంలో అధికారులు వ్యసాయ విస్తరణ అధికారులకు(ఏఈవో) బాధ్యతలను అప్పగించారు. సర్వే కోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. ఒక్కో పురుష ఏఈవోకు 2వేలు, మహిళా ఏఈవోలకు 1800ఎకరాల భూములను కేటాయించారు. ఒక్కో ఏఈవో పరిధిలో సుమారు 5వేల ఎకరాల భూములు ఉండగా.. రెండు వేలు డిజిటల్ క్రాప్ సర్వే చేయాలని మిగిలిన భూములను సాధారణంగా పంటల నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

జిల్లాలో వానాకాలంలో సర్వే చేయనున్న సాగుభూమి వివరాలు..

మొత్తం పంచాయతీలు	:	471
పురపాలక సంఘాలు	:	3
కార్పొరేషన్	:	1
మొత్తం క్లస్టర్లు	:	67
సర్వే చేయనున్న క్లస్టర్లు	:	67
రైతులు	:	2,26,349
మొత్తం భూములు (ఎకరాల్లో)	:	5,91,747

సర్వే తీరుతెన్నులు ఇలా..

దేశవ్యాప్తంగా ఆహార భద్రత, పంటల బీమాతో పాటు ప్రకృతి వైపరీత్యాలతో కలిగే పంటల నష్టాలను అంచనా వేసేందుకు, ఆహార ధాన్యాల ఎగుమతి, పంటల కొనుగోలు, సాగు ప్రణాళికలు, మార్కెటింగ్, తదితర సదుపాయాలను నిబంధనలకు అనుగుణంగా చేసేందుకు డిజిటల్ సర్వే ఉపయోగపడుతుందనే సదుద్దేశ్యంతో సర్వే చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. డిజిటల్ అగ్రిమిషన్ పథకం అమలు చేసేందుకు నిధులను కేటాయిస్తుంది. జిల్లాలో సాగుచేస్తున్న పంటలకు తెగుళ్లు వస్తే వెంటనే గుర్తించి శాస్త్రవేత్తలు సరైన సలహాలు, సూచనలు అందించేందుకు దోహదపడుతుంది.



క్షేత్రస్థాయిలో పంటల వివరాలు తెలుసుకుంటున్న ఏఈవోలు

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం :

బాబురావు (జిల్లా వ్యవసాయ అధికారి)

రైతులు సాగుచేస్తున్న పంటల వివరాలను యాప్‌లో నమోదు చేయడం ద్వారా ప్రభుత్వం వద్ద ఏ రకమైన పంటలు అనే అంశాలు ఉంటాయి. రైతులు ఎంత పంటను ఎంత విస్తీర్ణంలో వేశారు. పండించిన పంటల దిగుబడి ద్వారా వచ్చిన దాన్యం విక్రయించేటప్పుడు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించే అవకాశం ఉంటుంది.

ఈవీఎం గోదాము తనిఖీ

ఫైర్ అలారం పనితీరును పరిశీలించిన కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదామును కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఈవీఎం గోదాము సీల్‌ను పరిశీలించి.. రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో తెరిచి లోపలికి వెళ్లారు. ఈవీఎం, వీవీ ప్యాట్లు ఉన్న గదిని పరిశీలించారు. ఫైర్ అలారం పనితీరును పరిశీలించారు. అగ్నిమాపక యంత్రాల పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు సీసీ కెమెరాల పనితీరు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. ఆ తర్వాత తనిఖీ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ పి శ్రీనివాసరెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు ఎంఎ రాజు, కలెక్టరేట్ డీటీ అన్సారీ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పి శ్రీనివాస్, గంటేల విద్యాసాగర్, ఎస్ నవీన్‌రెడ్డి, ఎల్ సతీష్, పి కృష్ణప్రసాద్, ఏ గోపాల్‌రావు, సీహెచ్ నాగేశ్వరరావు ఉన్నారు.


ఈవీఎం గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

శిథిలావస్థ భవనాల్లో.. అధికారుల అవస్థలు
పెనుబల్లి ప్రభుత్వ కార్యాలయాల్లో స్లాబ్ పెచ్చులూడి పడుతున్నవైనం
భయాందోళనలో అధికారులు 4

బాలికలకు అజీమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్

దరఖాస్తుకు ఈ నెల 30 చివరి తేదీ

కొత్తగూడెం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుతున్న బాలికలు అజీమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్ కోసం ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంస్థ పేర్కొంది. ఏడాదికి ఒక్కొక్క విద్యార్థినికి రూ.30వేల వరకు స్కాలర్‌షిప్ లభిస్తుంది. ఈ ఏడాది ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్, ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి, 2025-26 విద్యాసంవత్సరంలో గుర్తింపు పొందిన డిగ్రీ లేదా డిప్లమో కోర్సుల్లో ప్రవేశం పొందిన వారు స్కాలర్‌షిప్‌నకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అర్హులుగా పేర్కొంది. ఏలాంటి ప్రవేశ రుసుము లేదు. ఆన్‌లైన్ నమోదుకు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌పుస్తకం, పది, ఇంటర్మీడియట్ ఒరిజినల్ మార్క్స్ మెమో, డిగ్రీలో అడ్మిషన్ పొందిన నిర్ధారణ సర్టిఫికెట్ ఉంచుకోవాలి. మొదటి విడత ఈనెల 30లోగా పూర్తవుతుంది. రెండో విడత వచ్చే ఏడాది జనవరి 10 నుంచి 30వ తేదీ వరకు జరుగుతుంది. ఇతర వివరాల కోసం సమగ్ర శిక్ష విద్యా హెల్ప్‌లైన్ 18004252428 ఫోన్ చేయాలని సూచించారు.

14న కొత్తగూడెంలో జిల్లా బెంచ్ ప్రెస్ పోటీలు

కొత్తగూడెం సాంస్కృతికం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14వ తేదీన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎన్‌కరేజ్‌మెంట్ బెంచ్‌ప్రెస్ పోటీలను కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు పవర్‌హౌస్ జిమ్ నిర్వాహకుడు షమియుద్దీన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను సబ్ జూనియర్ 14- 18 ఏళ్లు, జూనియర్ 19- 23 ఏళ్లు, సీనియర్ 19-23 ఏళ్ల వయస్సు పైబడిన వారికి నిర్ధారించిన కాటగిరిలో పురుషులు, మహిళలకు నిర్వహించనున్నారు. వీరితో పాటు మాస్టర్ 1, 2, 3, 4 కాటగిరిలో నిర్ధారించిన 40 ఏళ్ల పైబడి 70 ఏళ్ల లోపు క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 8885153381, 9885442131 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని నిర్వహకులు విజ్ఞప్తి చేశారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా

కృష్ణసాగర్ నుంచి భద్రాద్రి వరకు సీపీఐ పాదయాత్ర



పాదయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అటవీహక్కుల చట్టం ప్రకారం పోడు భూములకు పట్టాలివ్వాలని, గిరిజనులపై అటవీ అధికారుల దాడులు ఆపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే. సాబీర్‌పాషా అన్నారు. బూర్గంపాడు మండలం కృష్ణసాగర్ నుంచి భద్రాచలంకు పాదయాత్ర నిర్వహించగా అందులో సాబీర్‌పాషా పాల్గొన్నారు. అనంతరం ఐటీడీఏ ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాబీర్‌పాషా మాట్లాడుతూ 2005 కంటే ముందు నుంచే పోడు సాగు చేసుకుంటున్న ఆదివాసీలకు పట్టాలివ్వాలని అన్నారు. సాగు చేస్తున్న పత్తి చేలను అటవీ అధికారులు ధ్వంసం చేస్తున్నారని, మహిళలపై విచక్షణారహితంగా వ్యవహరిస్తూ దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ విషయాలపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు శాసనసభలో పలుమార్లు లేవనెత్తిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అలాగే ఇటీవల చంద్రుగొండ పర్యటన సమయంలోనూ సీఎం దృష్టికి సమస్యలను తెచ్చారన్నారు. ఈసమస్యలు పరిష్కరించకుంటే జిల్లా కేంద్రంలో 20 వేల మందితో ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. పీవో రాహుల్‌తో ఫోన్లో మాట్లాడి సమస్యలను వివరించగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎం.విశ్వనాధం, కల్లూరి వెంకటేశ్వరారవు, రావులపల్లిరవి కుమార్, ఎం.ఫుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, ఈసంశెట్టి పూర్ణచంద్రరావు, పేరాల శ్రీనివాస్, సాధనపల్లి సతీష్, కె.శ్రీనివాస్, ఎ.సీతారామరెడ్డి, ఎన్.నాగేశ్వరారవు, ఎం.బాలకృష్ణ, ఏపూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థ భవనాల్లో..

అధికారుల అవస్థలు

స్లాబ్ పెచ్చులూడి పడుతున్న పెనుబల్లి ప్రభుత్వ కార్యాలయ భవనాలు ● భయాందోళనలో అధికారులు

పెనుబల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి మండల కాంప్లెక్స్ కార్యాలయాలు నిర్మించి 25ఏళ్ల గడిచింది. ఇప్పుడు ఆ భవనాలు అవన్నీ శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోతాయోననే పరిస్థితిలో ఉండటంతో అక్కడి అధికారులు, సిబ్బంది ప్రతి రోజూ బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. 2000వ సంవత్సరంలో పెనుబల్లి మండల పరిషత్, తహసీల్దార్, మండల వనరుల కేంద్రాలను ప్రభుత్వం నిర్మించింది. వాటిల్లో మండలపరిషత్, తహసీల్దార్, మండల వనరుల కేంద్రంలో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీటితో పాటు పదేళ్ల క్రితం మండలపరిషత్ కార్యాలయంపై అదనపు గదులను కూడా నిర్మించారు. వీటిని అప్పట్లో పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు వినియోగించారు. పెనుబల్లి మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ, జడ్పీటీసీ ప్రజాప్రతినిధులకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయడంతో పాటు ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి కూడా వేర్వేరు గదులను కేటాయించారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంపైన నిర్మించిన అదనపు గదులు అతి తక్కువ కాలంలోనే శిథిలావస్థకు చేరాయి. గత ఐదేళ్లకుపైగా ఆ గదులను సిబ్బంది వినియోగించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రస్తుతం మండల పరిషత్ కార్యాలయ సిబ్బందికి కేటాయించిన గదుల్లో పూర్తిగా వర్షపునీరు చేరడంతో పాటు కంప్యూటర్లపై వర్షపు నీరు పడటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎంపీడీవో కార్యాలయం వెనుక నిర్మించిన మరుగుదొడ్లు కూడా నిరుపయోగంగా మారాయి. దీంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెవెన్యూ కార్యాలయం కూడా శిథిలావస్థకు చేరి స్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. ఈ మేరకు తహసీల్దార్ ఎస్వీ.నారాయణమూర్తి ఇటీవల కొంతమేర మరమ్మతులు చేయించినప్పటికీ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో ఏ సమయంలో పెచ్చులూడి పడడంతో పాటు ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. మండల వనరుల కేంద్రం భవనంలో గోడలు నెర్రెలు బారడం, స్లాబ్ పెచ్చులూడి పడుతుండటంతో పాటు నీరు చేరడంతో కొన్ని గదులను వినియోగించటం లేదు. కొన్ని గదులు వినియోగిస్తున్నప్పటికీ వర్షపునీరు చేరుతుండటంతో గత్యంతరం లేని పరిస్థితుల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. ఈ భవనాల స్థానంలో నూతన భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



స్లాబ్ పెచ్చులూడిన రెవెన్యూ కార్యాలయం



శిథిలావస్థలోమండల పరిషత్ కార్యాలయం



కంప్యూటర్లపై వర్షపు నీరు పడుతుండటంతో పట్టాలు కట్టిన దృశ్యం

'హస్తిన'లో ఐటీడీఏ పీవో

గిరిజన మంత్రిత్వ శాఖ జాతీయ సదస్సుల్లో పాల్గొన్న రాహుల్



జాతీయ సదస్సులో మాట్లాడుతున్న భద్రాద్రి ఐటీడీఏ పీవో రాహుల్



గిరిజన మ్యూజియంపై పుస్తకాన్ని కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శికి అందజేస్తున్న పీవో

భద్రాచలం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 9, 10 తేదీల్లో జరిగిన కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ జాతీయ సదస్సులో భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ పాల్గొన్నారు. దేశంలోని 20 రాష్ట్రాల నుంచి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు హాజరు కాగా అందు లో ఐదుగురికి మాత్రమే మాట్లాడే అవకాశం లభించింది. అందులో భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఒకరు కావడం విశేషం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదేశాల మేరకు గిరిజన అభివృద్ధి- 2047 దృష్టి కోణంలో జరుగుతున్న పురోగతిని సమీక్షించేందుకు భవిష్యత్తు రోడ్డు మ్యాప్‌ను రూపొందించేందుకు వివిధ రాష్ట్రాల గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శులు, ప్రాజెక్టు అధికారులతో జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ పాల్గొని తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ పరిధిలో ఉన్న 19 మారుమూల మండలాల్లోని 130 గ్రామాల్లో ఆది కర్మయోగి అభియాన్, దర్తీ ఆబాజాన్ జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్, పీఎం జన్మన్, అటవీ హక్కుల చట్టం అమలు తీరుపై సదస్సులో వివరించారు. ఆదివాసీ గిరిజన గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనులకు, కొండరెడ్లకు కావల్సిన మౌలిక వసతుల కల్పనకు అధికారులతో గ్రామసభలు నిర్వహించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అలాగే ఐటీడీఏ ద్వారా చేపడుతున్న సంక్షేమ పథకాలు గిరిజనులకు అందించి వారి జీవనోపాధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా గిరిజన మ్యూజియంకు సంబంధించిన కాపీ బుక్కును కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి వీభూ నాయర్‌కు అందించారు.

'ఇందిరమ్మ ఇళ్ల' ఇసుక టాక్టర్లపై సర్వే చేపట్టాలి

ఆంధ్రజ్యోతి కథనానికి

చింతకాని, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌కు రూ.2వేలు వసూలు అనే శీర్షికతో శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనానికి చింతకాని తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి స్పందించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇసుక ట్రాక్టర్ల వద్ద నుంచి కొంత మంది ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా డబ్బులు వసూలు చేస్తుండటంతో మండల వ్యాప్తంగా తీవ్ర చర్చాంశనీయమైంది. దీంతో ముదిగొండ మండలం గంగాపురం రెవెన్యూలో పరిధిలో భూములు ఉన్న సదరు వ్యక్తులకు సంబంధించిన భూములను చింతకాని, ముదిగొండ రెవెన్యూ సిబ్బందితో పాటు మైనింగ్ అధికారుల బృందంతో ఉమ్మడి సర్వే చేయాలని కోరుతూ మైనింగ్ ఏడీఏకు శుక్రవారం లేఖ రాశారు. ఇదిలా ఉండగా శుక్రవారం అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తులు మున్నేటి మధ్యలో ఉన్న గేటుకు తాళం వేశారు.

17న ఖమ్మానికి సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబి

సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభకు హాజరు

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభ ఖమ్మం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రం లో ఈ నెల 17న నిర్వహిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రకటించారు. ఈ సందర్భంగా శుక్రవారం సుందరయ్య భవన్‌లో నిర్వహించిన విలే కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభలకు సీపీఎం జాతీయ ప్రధాన కార్యద ర్శి ఎంఏ బేబి, కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు హాజరవుతారన్నారు. తెలంగాణ సాయుధ పోరా టాన్ని బీజేపీ వక్రీకరిస్తుందని ఆరోపించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేశ్, వై.విక్రమ్ పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమాల్లో..

కార్మికుల సమ్మెబాట

(3వ పేజీ తరువాయి)

పనులు చేసేందుకు దినసరి వేతనంపై 435 మంది కార్మికులు పని చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో ఆశ్రమ పాఠశాలలు 5, వసతిగృహాలు 23, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు 9 ఉన్నాయి. ఆయా సంస్థల్లో వేలాది మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తూ వసతి పొందుతున్నారు. ఆయా వసతి కేంద్రాల్లో 80మంది దినసరి కార్మికులు పని చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 515 మంది గిరిజన కార్మికులు పనిచేస్తున్నారు. వీరంతా ప్రస్తుతం తమ సమస్యలు పరిష్కరించాలంటూ సమ్మె బాట పట్టారు. గతంలో 2023లో సమ్మె చేయగా.. సమస్యలు పరిష్కరిస్తామని తెలిపిన ప్రభుత్వం హామీలు నెరవేర్చకపోవటంతోనే నిరవధిక సమ్మెబాట పట్టామని కార్మికులు తెలిపారు. అరకొర వేతనంపై పని చేసే తమ సమస్యల పరిష్కారానికి పాలకులు శ్రద్ధ కనబర్చడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వంట చేసిన వార్డెన్లు, ఉపాధ్యాయులు

తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్ డైలీవేజ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో దినసరి కార్మికులు సమ్మెబాట పట్టడంతో.. ఆశ్రమాల్లో వివిధ రకాల పనులు నిలిచిపోయాయి. ప్రధానంగా విద్యార్థులకు దినసరి కార్మికులే వంట చేసి పెడతారు. ఆశ్రమాల్లో శుక్రవారం కార్మికులు సమ్మెలోకి వెళ్లటంతో వార్డెన్లు, కొందరు ఉపాధ్యాయులు వంట చేసి చిన్నారులకు ఆహారాన్ని అందించారు. కొన్నిచోట్ల విద్యార్థులు కూడా సాయం చేసినట్లుగా సమాచారం. వంటను మినహాయిస్తే ఇతర పనులు చేసేవారు లేకపోవడంతో.. కొంతమేర ఇబ్బందులు ఏర్పడ్డాయి. సమ్మె ఇలాగే కొనసాగితే ఆశ్రమాల్లో తాత్కాలికంగా స్థానికంగా ఉన్న కొందరిని దినసరి వేతనంపై కొందరిని ఏర్పాటు చేసుకునేందుకు సిద్ధమైనట్లుగా సమాచారం. తమ సమస్యలు పరిష్కరించే వరకూ ఈసారి సమ్మెను కొనసాగిస్తామని దినసరి కార్మికులు తెలిపారు.

16 నుంచి ఖమ్మం రీజియన్‌లో

యాత్రాదానం ప్రారంభం

(3వ పేజీ తరువాయి)

ఎన్ఆర్ఐలు, అసోసియేషన్స్, ఎన్జీవోలు స్పాన్సర్ చేసి అనాథలు, నిరాశ్రయులైన వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద విద్యార్థులను ప్రసిద్ధ దేవాలయాలకు, పర్యాటక ప్రాంతాలకు, విహారయాత్రలకు తీసుకెళ్లొచ్చునని తెలిపారు. ఈ యాత్రాదాన కార్యక్రమాన్ని వ్యక్తులు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కూడా వినియోగించుకోచ్చునని, యాత్రాదాన కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, పర్యాటక స్థలాలను కవర్ చేస్తూ ప్రత్యేక టూర్ ప్యాకేజీలను సంస్థ రూపొందించిందన్నారు. దాతలు చెల్లించే విరాళం మేరకు కిలో మీటర్ల ఆధారంగా ఏసీ, సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్ ప్రెస్ బస్సులను విహారయాత్రలకు సంస్థ ఏర్పాటు చేస్తుందని, టూర్ ప్రారంభానికి వారం రోజుల ముందు బస్సులను బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. డిపో మేనేజర్లను (ఖమ్మం, మధిర, సతుపల్లి, కొత్తగూడెం, ఇల్లందు, భద్రాచలం, మణుగూరు) అధికారులను సంప్రదించి యాత్రాదానం కింద బస్సులను బుక్ చేసుకోవచ్చునని, అదేవిధంగా హెల్ప్ లైన్ నంబర్లు 040-69440000, 040-23450033లకు కాల్ చేసి సమాచారం ఇచ్చినట్లయితే, సంబంధిత అధికారులు తిరిగి సంప్రదించి పూర్తి వివరాలను తెలియజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా అనాథలు, నిరాశ్రయులు, దివ్యాంగులు, నిరుపేద విద్యార్థులకు జీవితంలో మరపురాని అనుభూతిని కలిగించవచ్చని తెలిపారు.

టేకు కలప పట్టివేత

చర్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) చర్ల మండలం (దుమ్ముగూడెం రేంజ్) ఆర్ కొత్తగూడెం సెక్షన్ పరిధిలోని కుర్నపల్లి గ్రామంలో శుక్రవారం టేకు కలపను భద్రాచలం ఎఫ్‌డీవో సుజాత దాడిచేసి పట్టుకున్నారు. కుర్నపల్లి గ్రామంలో ఓ ఇంటి వద్ద టేకు కలపతో వస్తువులు తయారీ చేస్తున్నట్లు ఎఫ్‌డీవో సుజాతకు సమాచారం అందింది. దీంతో ఆమె దుమ్ముగూడెం రేంజ్ అధికారి కమలతో కలిసివెళ్లి కలపను పట్టుకున్నారు. అనంతరం కలపను భద్రాచలం ఎఫ్‌డీవో కార్యాలయానికి తరలించారు. పట్టుబడిన కలపలో గుమ్మాలు, కిటికీలు ఉన్నట్లు రేంజ్ అధికారి కమల తెలిపారు. కాగా పట్టుబడిన కలప విలువ సుమారు రూ.లక్షకు పైగా ఉంటుందని తెలుస్తోంది.

రూ.43 లక్షల విలువైన గంజాయి పట్టివేత

కారుతో సహా ఐదుగురు అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్.. పరారీలో ముగ్గురు

అరెస్టైన వారిలో కేరళకు చెందిన ఎన్‌డీఆర్ఎఫ్ కానిస్టేబుల్

పట్వారిగూడెం సమీపంలో పట్టుకున్న పోలీసులు

మీడియా సమావేశంలో వెల్లడించిన పాల్వంచ డీఎస్పీ సతీష్



మీడియా ఎదుట నిందితులను ప్రవేశపెట్టి వివరాలు వెల్లడిస్తున్న పాల్వంచ డీఎస్పీ సతీష్

దమ్మపేట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రూ.43 లక్షల విలువైన 86 కిలోల గంజాయిని ఓ కారులో అక్రమంగా తరలిస్తుండగ దమ్మపేట పోలీసులు శుక్రవారం ఉదయం మండలంలోని పట్వారిగూడెం సమీపంలో పట్టుకున్న సంఘటన కలకలంలేపింది. శుక్రవారం సాయం త్రం పాల్వంచ డీఎస్పీ సతీష్, అశ్వారావుపేట సీఐ పింగళి నాగరాజు, దమ్మపేట ఎస్ఐ సాయి కిషోర్‌రెడ్డితో కలసి దమ్మపేట పోలీస్‌స్టేషన్‌లో ఈ ఘటనకు సంబంధించిన నిందుతులను, పట్టుబడిన గంజా యిని, వాహనం గురించి వివరాలు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సంఘటన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పాల్వం చ వైపు నుండి దమ్మపేట వైపుకు ఓ కారు వస్తున్న సమాచారంతో సీఐ నాగరాజు ఆధ్వర్యంలో దమ్మపేట ఎస్ఐ సాయి కిషోర్‌రెడ్డి సిబ్బందితో కలసి ఆ వాహనాన్ని పట్టుకున్నారు. వాహనంలో గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్టు గుర్తించి కారుతో పాటు ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఒడిస్సా ప్రాంతం నుంచి చెన్నైకు రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. కారులో నాలుగు బస్తాలలో 40 గంజాయి ప్యాకెట్లు(ఒక్కోటి రెండు కిలోల చొప్పున) 85.540 కిలోల బరువు కలిగిన గంజాయిని పట్టుకున్నట్టు తెలిపారు. దీని విలువ రూ.42,77,000లు ఉంటుందని పోలీసులు తెలిపారు. గంజాయి అక్రమ రవాణాలో కేరళలోని తిరువంతపురం, సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ (డిప్యూటేషన్‌పై ఎన్‌డీఆర్ఎఫ్ నాల్గవ బెటాలియన్‌లో) పనిచేస్తున్న పనగుడు శివకృష్ణ పట్టుబట్టాడు. ఈయనతో పాటు తమిళనాడు తంజావూరుకు చెందిన జయరామన్, కేవీఎన్ ట్రాన్స్‌పోర్టు ఉద్యోగి (రిసీవర్), తమిళనాడు మదురై జిల్లాకు చెందిన కృష్ణమూర్తి మారియప్పన్(రిసీవర్), తమిళనాడులోని తూతుకూడి జిల్లాకు చెందిన కందస్వామి రంజిత్, జేసీబీ ఆపరేటర్, తమిళనాడు, మధురైకి చెందిన రాము వసంత్, ఏఆర్‌కె బ్రూపింగ్ మెషీన్ ఆపరేటర్(రిసీవర్)తో పాటు టీఎస్ 11ఈఏ 1724 నెంబరు గల టయోటా ఇన్నోవా వాహనం, రెండు సెల్‌ఫోన్‌లు, ఒక ఐడీ కార్డు, 85.540కిలోల గంజాయి(40ప్యాకెట్లు)ను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి కోర్టుకు పంపుతున్నట్టు పాల్వంచ డీఎస్పీ సతీష్ వెల్లడించారు. వీరితో పాటు మరో ముగ్గురు వ్యక్తులు ఈ ఘటనలో కీలకంగా ఉన్నారని, వీరు పరారీలో ఉన్నట్టు డీఎస్పీ వెల్లడించారు. పరారీలో ఉన్న వారి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సిటో ఇతనిది ఒడిశా రాష్ట్రం బెహరగూడ జిల్లా కలిమేలా కలిడిండి గ్రామం. ఇతను గంజాయిని ఒడిస్సా నుండి మోతుగూడెంలో పైన పట్టుబడిన వ్యక్తులకు అప్పగిస్తాడు. స్వాతి అలియాస్(ఏపీలోని రాజమండ్రి), తమిళనాడులోని తిరుపూర్‌కు చెందిన షణ్ముఖం ద్వారా చెన్నైకి తరలించి గంజాయిని తరలిస్తున్నారు. ఈ ముగ్గురు గంజాయి సరఫరాలో అత్యంత కీలకంగా వ్యవహరిస్తారు. గంజాయిని రవాణా చేస్తున్న కారు అసలు నెంబరు వీబీ10 డీయు 0831 కాగా నిందుతులు ఈ ప్లేట్‌పైన 11ఈఏ 1724 అనే ఫేక్ నెంబర్ ప్లేటును అమర్చినట్టు తెలిపారు. చాకచక్యంగ గంజాయిని పట్టుకున్న పోలీస్ సిబ్బందిని ఎస్పీ, డీఎస్పీ అభినందించారు. ఈ దాడుల్లో అశ్వారావుపేట సీఐ నాగరాజు, దమ్మపేట ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ కె.వెంకటేశ్వర్లు, సిబ్బంది బీ.వీర,ఎన్.లక్ష్మయ్య, ఏ.రమేష్, వీ.రాజేష్‌లు పాల్గొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్టు తెలిపారు.

టీ న్యూస్ ఛానల్ రిపోర్టర్‌పై కేసు నమోదు

కొణిజర్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : టీ న్యూస్ ఛానల్ రిపోర్టర్ వి. సాంబశివరావుపై ఖమ్మం జిల్లా కొణిజర్ల పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు కొణిజర్ల ఎస్సై సూరజ్ శుక్రవారం తెలిపారు. కొణిజర్ల గ్రామానికి చెందిన గంధం నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఎస్సై కథనం ప్రకారం.. నాగరాజు గురువారం కొణిజర్ల సొసైటీకి వెళ్లి వరుసలో నిలుచోగా.. ఖమ్మంకు చెందిన టీ న్యూస్ ఛానల్ రిపోర్టర్ వి. సాంబశివరావు, సహాయ వీడియోగ్రాఫర్ కలిసి సెంటర్‌కు వచ్చిన రైతులతో మాట్లాడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా చెప్పాలని తెలపడం జరిగింది. వాస్తవానికి ప్రభుత్వం పంపించే యూరియా క్యూలో ఉన్న వారందరికీ సరిపోతుందని తెలిపినప్పటికీ.. కాంగ్రెస్ పార్టీకి వారికి మాత్రమే యూరియా ఇస్తున్నారని, బీఆర్ఎస్ వారికి యూరియా ఇవ్వడం లేదని, ధర్నాలు చేస్తామని చెప్పాలంటూ రైతులకు చెబుతూ రైతులను రెచ్చగొట్టే విధంగా సాంబశివరావు వ్యవహరించారని ఫిర్యాదులో తెలిపారు. సాంబశివరావుపై కేసు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఖండించిన జర్నలిస్టు సంఘాలు

సాంబశివరావుపై పోలీసులు కేసు నమోదు చేయడాన్ని ఖమ్మంకు చెందిన టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్), టీయుడబ్ల్యూజే (ఐజేయూ) సంఘాలు వేర్వేరుగా ఖండించాయి. సాంబశివరావుపై పెట్టిన కేసులను తక్షణమే ఉపసంహరించు కోవాలంటూ టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) తరపున ఖమ్మం అడిషనల్ డీసీపీ ప్రసాదరావును కలిసి వినతిపత్రం అందించారు. టీయుడబ్ల్యూజే (ఐజేయూ) ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు, టీ యూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్నారవిలు రిపోర్టర్‌పై పెట్టిన కేసును ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్



జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్

ఖమ్మం లీగల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సేవాధికారసంస్థ ఆదేశానుసారం ఖమ్మం న్యాయ సేవాధికారసంస్థ ఆధ్వర్యంలో నేడు జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో కక్షిదారులు కేసులు పరిష్కరించుకునేందుకు ఇరుపక్షాల కక్షిదారులతో పాటు, న్యాయవాదులు సహకరించాలని సూచించారు. లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కారంమైతే ఇరుపక్షాల గెలుపుగా భావించవచ్చునని, వివిధ కోర్టులలో వివిధ కేసులకు సంబంధించి బెంచులనుని ర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికారసంస్థ చైర్మన్ జి.రాజగో పాల్ తెలియజేశారు. మోటారు వాహన, ప్రమాదబీమా కేసులతో పాటు, సివిల్ వివాదాల కేసులను మూడవ అదనపు జిల్లా ప్రధాన న్యాయాధికారి దేవినేని రాం ప్రసాదరావు, సివిల్, క్రిమినల్ కేసులను రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి టి.మురళీమోహన్, ప్రీ లిటిగేషన్ కేసులను న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి కె.వి.చంద్రశేఖరరావు, మిగిలిన కోర్టుల్లో వారివారి బెంచులను న్యాయాధికారులు నిర్వహించనున్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకి న్యాయాధికారి కాసరగడ్డ దీప, ఒకటవ అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ, మూడవ అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి వినుకొండ మాధవి, సంచార ప్రత్యేక న్యాయస్థాన న్యాయాధికారి బి.నాగలక్ష్మిలు లోక్‌అదాలత్ బెంచులను నిర్వహించనున్నారు. నేడు జరగనున్న లోక్ అదాలత్‌కు కక్షిదారుల సౌకర్యార్థం జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ అన్ని ఏర్పాట్లు చేశారు.

ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

మధిర రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మధిర ఏట్లో ఈత కొట్టేందుకు వెళ్లి నీటి ప్రవాహానికి ఓ వ్యక్తి కొట్టుకుపోయి మృతిచెందిన సంఘటన శుక్రవారం మధిర పట్టణంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఎర్రుపాలెం మండలం చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన తొర్లికొండ కృష్ణ(50) సెంట్రింగ్ వర్కర్‌గా పనిచేస్తుంటాడు. అయితే ఇతను మధిరలో 20 ఏళ్లుగా నివాసముంటున్నాడు. ప్రతిరోజూ ఉదయం ఈతకు వెళ్లే అలవాటు ఉంది. రోజూ మాదిగానే శుక్రవారం ఉదయం ఆరు గంటల సమయంలో మధిర శివాలయం సమీపంలో ఈత కొట్టేందుకు మిత్రుడు యాసాల రాముతో కలిసి వెళ్లాడు. ఏట్లో దిగి ఈత కొడుతున్న సమయంలో ఒక్కసారిగా వచ్చిన నీటి ప్రవాహానికి చెక్‌డ్యాం సమీపంలో కృష్ణ కొట్టుకుపోయి మెట్ల సమీపంలో శవమై తేలాడు. అతనికి కొద్దిదూరంలోనే ఏట్లో ఈత కొడుతున్న రాము అనే వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని స్వగ్రామమైన చొప్పకట్లపాలెంకి తీసుకువెళ్లారు. ఇతని మృతి పట్ల స్విమ్మర్ సభ్యుల్లోనూ, సెంట్రింగ్, తాపీ కార్మికులు, కుటుంబ సభ్యుల్లోనూ విషాద ఛాయలు అలుముకున్నాయి.

డెంగ్యూతో ఫార్మా విద్యార్థిని మృతి



దుగ్గిరాల దీపిక (ఫైల్)

కల్లూరు, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి) కల్లూరు మండలంలోని చం ద్రుపట్ల గ్రామంలో గురువార అర్ధరాత్రి డెంగ్యూతో ఓ ఫార్మా విద్యార్థిని మృతి చెందినది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చంద్రుపట్ల గ్రామానికి చెందిన దుగ్గిరాల లక్ష్మీనారాయ ణ విజయలక్ష్మిల కుమార్తె దుగ్గిరాల దీపిక(22) వరంగల్‌లో ఫార్మా డీ చివరి సంవత్సరం చదువుతుంది. కాలేజీలోనే ఉండగా గత ఐదు రోజు ల క్రితం దీపికకు డెంగ్యూ పాజిటివ్ సోకింది. దీంతో సమాచారం అం దుకున్న తల్లిదండ్రులు రెండు రోజుల క్రితం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా పరిస్థితి విషమించి గురువారం అర్ధరా త్రి మృతి చెందింది. దీంతో చంద్రుపట్ల గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. దీపిక మృతితో వరంగల్‌లో సహచర విద్యార్థులంతా శుక్ర వారం మండలంలోని చంద్రుపట్లలోని దీపిక నివాసానికి చేరుకొని మృతదేహంపై పూలామాల వేసి కంటతడిపెడుతూ నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అక్రమ ఇసుక దందా

పాత కూపన్లపై తేదీ మార్చి ఇసుక రవాణా

అధికారులకు ఫిర్యాదు

మధిర రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం రాయపట్నం ఇసుక రీచ్‌లో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతుంది. మధిరకు చెందిన కొంతమంది పాత ఇసుక కూపన్లపై తేదీ మార్చి యథేచ్ఛగా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. దీంతో స్థానికులు శుక్రవారం మధిర రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో ఆఇళ్ల నిర్మాణం కోసం రాయపట్నం వద్ద ఇసుక రీచ్‌ను ఏర్పాటుచేశారు. ఒక కూపన్ తీసుకున్న వారు ఇసుక తోలుకున్న తర్వాత ఆ కూపన్ తేదీని మార్చి శుక్రవారం తేదీతో ఇసుకను రవాణా చేస్తున్నారు. దీంతో తహసీల్దార్, ఆర్ఐకు స్థానికులు ఫిర్యాదు చేశారు. మధిర టౌన్ ఆర్ఐ శిరీష ఇసుక రీచ్ వద్దకు చేరుకొని కూపన్లు పరిశీలించి ట్రాక్టర్లను అడ్డుకున్నారు. వారి వద్దనున్న పాత కూపన్లను రద్దుచేశారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కూపన్ల ముసుగులో ఒక కూపన్ తీసుకున్న వారు రెండు, మూడు ట్రాక్టర్లు, తేదీలు మార్చి మరి కొంతమంది అక్రమార్కులు ఈ రీచ్‌లో యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిబంధనల మేరకే ఇసుక రవాణా చేయాలని, అక్రమాలు జరగకుండా అధికారులు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

భద్రాచలం డిపో కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి: ఐదురోజుల నుంచి భద్రాచలం ఆర్టీసీ డిపోలో జరుగుతున్న పోరాటానికి ఖమ్మం రీజియన్ ఆర్టీసీ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ(జేఏసీ) సంపూర్ణ మద్దతు తెలిపింది. శుక్రవారం ఖమ్మం రీజినల్ మేనేజర్ కార్యాలయంలో కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ (జేఏసీ)ఆధ్వర్యంలో పర్సనల్ ఆఫీసర్(పి.ఓ) సంపత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రీజినల్ ఆర్టీసీ జేఏసీ నాయకులు పాల్గొన్నారు. మోటార్ ట్రాన్స్ పోర్ట్ యాక్ట్(ఎంటిడబ్ల్యూ) ప్రకారం డ్యూటీలను అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. లేనియెడల ఖమ్మంరీజియన్ వ్యాప్తంగా అన్నీ సంఘాల (జేఏసీ) ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

విప్లవోద్యమ ధ్రువతార సీతారాం ఏచూరి

సీపీఎం కార్యాలయంలో ఘన నివాళులు



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నున్నా, పొన్నం

ఖమ్మంసంక్షేమ విభాగం, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): భారత విప్లవోద్యమ ధృవతార కామ్రేడ్ సీతారాం ఏచూరి అని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం సుందరయ్య భవన్‌లో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభను నిర్వహించారు. పార్టీకి ఆయన చేసిన సేవల్ని గుర్తు చేశారు. నాయకులు మాచర్ల భారతి, మాదినేని రమేశ్, యర్రా శ్రీనివాసరావు, బండి పద్మ, దొంగల తిరుపతిరావు, మెరుగు రమణ పాల్గొన్నారు.

కామేపల్లి: మండల కేంద్రంలోని సీపీఎం మండల కార్యాలయంలో సీతారం ఏచూరి ప్రథమ వర్ధంతి జరిపారు.జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి క్రిష్ణ ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బాదావత్ శ్రీను, వింజం నాగభూషణం, చింతనిప్పు చలపతిరావు, రాయల సత్యనారాయణ, శ్రీనివాసరావు, అంజయ్య, వీరభద్రం, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ.3.70లక్షలకు ఐపీ దాఖలు

ఖమ్మంలీగల్,సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): ఖమ్మంరూరల్ మండలం పల్లెగూడెం గ్రామానికి చెందిన జ్యోతిష్యుడు కొల్లెం శివాజీ స్థానిక సీనియర్ సివిల్‌జడ్జి కోర్టులో ఐపీ దాఖలు చేశాడు. కుటుంబ మరియు ఆరోగ్య సమస్యల కారణంగా చేసిన అప్పు తీర్చలేక పోవటంతో ముగ్గురిని ప్రతివాదులుగా చేర్చుతూ రూ.3.70లక్షలకు ఐపీ దాఖలు చేశాడు. తనను దివాలాదారుడిగా ప్రకటించమని కోరుతూ న్యాయస్థానాన్ని పిటీషన్ దాఖలు చేశారు.

ఐడీబీఐ ఆధ్వర్యంలో కంప్యూటర్ల అందజేత



పాఠశాలలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న బ్యాంక్ సిబ్బంది

ఖమ్మంరూరల్,సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎమ్ వెంకటాయపాలెం ఉన్నత పాఠశాలకు ఐడీబీఐ ఖమ్మం బ్రాంచ్ ఆధ్వర్యంలో రూ.2లక్షల విలువ చేసే కంప్యూటర్లు, గోడఫ్యాన్లను వితరణగా శుక్రవారం అందజేశారు. పాఠశాలలో నిర్మించిన డిజిటల్ లెర్నింగ్ ల్యాబ్ ను ఎంపీడీవో శ్రీదేవి, ఎంఈఓ శ్రీనివాస్‌రావు, ఐడీబీఐ బ్రాంచ్ మేనేజర్ కృష్ణ ప్రసాద్, సూర్యాపేట మేనేజర్ నాగరాజు ప్రారంభించారు.ఉపాధ్యాయులు ఈ ల్యాబ్‌ను సక్రమంగా ఉపయోగించి విద్యార్థులకు పాఠాలను బోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సిబ్బంది వెంకన్న, శివ, రమేష్, వెంకట్, గ్రామ పెద్దలు వెంకటరామయ్య, వెంకటరమణ, నాగయ్య, రెంటాల నాగేశ్వరరావు, ఏఏపీసీ చైర్మన్ భాగ్యమ్మ, హెచ్ఎం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రక్షణ సిబ్బందే.. ప్రమాదం తెచ్చేలా!

- ఆర్టీసీ డిపో ఎదుటే రోడ్డుకిరువైపులా పార్కింగ్
- ఇబ్బందులు పడుతూ బస్సులు నడుపుతున్న డ్రైవర్లు
- తీరు మార్చుకోని డిపో సెక్యురిటీ అధికారులు



డిపోలో బస్సులకు తగిలేలా పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపో ఎదుట రోడ్డుపై బస్సులకు ఇబ్బందికరంగా వాహనాలు ఆపినా, పార్కింగ్ చేసినా చర్యలు తీసుకోవాల్సిన డిపో సెక్యురిటీ అధికారులే బస్సులు వెళ్లే దారిలో ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఈ కారణంగా డ్రైవర్లు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. బస్సులు లోపలికి వచ్చే సమయంలో, బైటకు వెళ్లే సమయంలో ఆద్విచక్రవాహనాలను తప్పించుకోని ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నిసార్లు చెప్పినా సంభదిత సెక్యూరిటీ అధికారి కానీ, సిబ్బంది కానీ పట్టించుకోవటం లేదని కొందరు ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెక్యూరిటీ అధికారికి సంబందించిన రెండు వాహనాలను రోడ్డుకు ఇరువైపులా వాహనాలను పార్కింగ్ చేస్తున్నాడని చెబుతున్నారు. ఈ విషయంపై ఎన్నిసార్లు చెప్పినా చూసుకోని పోనియండి డ్రైవర్లేగా మీరు అంటూ అసభ్యపదజాలంతో మాట్లాడుతాడని వివరించారు. ఇకనైనా డిపో సెక్యూరిటీ అధికారులు తీరు మార్చుకోకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

జలజ ప్రాజెక్టును విజయవంతం చేయాలి

- కలెక్టర్‌ను కలిసిన ఉద్యోగ సంఘాల నాయకులు

ఖమ్మంకలెక్టరేట్,సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ఐక్యంగా రాజీవ్‌స్వగృహ జలజ ప్రాజెక్టును దక్కించుకోవడం హర్షనీయమని .. రాష్ట్రంలోనే ఈ ప్రాజెక్టును ఆదర్శవంతంగా నిలపాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. శుక్రవారం ఉద్యోగ సంఘాల నాయకులు కలెక్టర్‌ను కలిశారు. ఉద్యోగ హౌజ్‌బిల్డింగ్ సొసైటీ బిడ్‌లో దక్కించుకోవడం పట్ల అభినందనలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో టీఎన్జీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాసరావు, టీజీవో జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి,విజయ్, రాంబాబు, టీఎన్జీఓ నాయకులు జైపాల్, వెంకన్న, దుర్గాప్రసాద్, హరికృష్ణ కోణార్, ప్రభాకరా చారి, రుక్మారావు, రమేష్, దిలీప్, సాయి, అస్లామ్, శంకర్, మంగ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీడీపీ నేతలు

కొద్దిరోజులుగా యూరియా కోసం రైతులు పడుతున్న అవస్థలను తక్షణమే నిరోధించి రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని మంచుకొండ సొసైటీ అధ్యక్షుడు మందడపు సుధాకర్, టీడీపీ నాయకులు, కేతినేని హరీష్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి వినతి పత్రాన్ని అందించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి యూరియా అవసరం మేరకు దిగుమతి చేసుకుని రైతులకు పంపిణీ చేయాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో తుమ్మలపల్లి నాగేశ్వరరావు, పెనుగొండ ఉపేందర్, మీగడ రామారావు చల్లగుండ్ల రమేష్, తాళ్లూరి నారాయణరావు, గంగవరపు అనంత్‌కుమార్ తదితరులున్నారు.



కలెక్టర్‌ను కలిసిన ఉద్యోగ సంఘాల నాయకులు



వినతిపత్రాన్ని అందిస్తున్న టీడీపీ నేతలు

యూరియా ఘర్షణలో రైతుపై ఏఈఓ ఫిర్యాదు

కామేపల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గురువారం కామేపల్లి రైతువేదికలో యూరియా కూపన్ కోసం జరిగిన వాగ్వాదం ఘటనలో రైతుపై ఏఈఓ రవి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. కామేపల్లి ఏఈఓ శ్రీకన్యతోనూ దురుసుగా ప్రవర్తించారని, విధులకు ఆటంకం కలిగించాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ఫిర్యాదుతో రైతును పోలీస్ స్టేషన్‌కు పోలీసులు పిలిపించినట్లు తెలిసింది.

ఎంపీ వద్దిరాజుకు సన్మానం

ఖమ్మంమార్కెట్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇటీవల అమెరికాలో గ్లోబల్ మున్నూరుకాపు అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొని తిరిగి వచ్చిన రాజ్యసభ ఎంపీ వద్దిరాజును శుక్రవారం జిల్లా మున్నూరుకాపు సంఘం బాధ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపీ వద్దిరాజు మాట్లాడుతూ మున్నూరుకాపు యువతకు ప్రపంచంలో ఏ ప్రాంతంలోనైనా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గ్లోబల్ మున్నూరు కాపు అసోసియేషన్ కృషి చేయాలని అన్నారు. బీసీరాజ్యాధికార ఉద్యమంలో కాపు సంఘం సభ్యులందరూ కలిసికట్టుగా సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘంనాయకులు ఆకుల గాంధీ, మేకల భిక్షయ్య, పారా నాగేశ్వరరావు, జాబిశెట్టి శ్రీనివాసరావు, కనకం జనార్ధన్, మాజీ కార్పొరేటర్లు తోట వీరభద్రం, మాటేటి నాగేశ్వరరావు,శీలంశెట్టి వీరభద్రం, తోట వీరభద్రం నాయకులు పిన్ని కోటేశ్వరరావు, యార్రా అప్పారావు పాల్గొన్నారు.

రాజమ్మకు నివాళులు

తిరుమలాయపాలెం,సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి):మండలంలోని కొక్కిరేణినికి చెందిన కాంగ్రెస్‌నాయకుడు సిరిగద్దే ఉపేందర్ తల్లి రాజమ్మ ఇటీవల మృతి చెందారు. పద్మశాలి సంఘంరాష్ట్ర అధ్యక్షుడు కే.మురళి నివాళులర్పించారు.

రైతులకు ఇబ్బంది కలగొద్దు

- తేమశాతం ప్రకారం పత్తికి మద్దతు ధర
- సీసీఐతో పత్తి కొనుగోళ్లపై అదనపు కలెక్టర్ సమీక్ష



సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మంకలెక్టరేట్, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులకు ఏలాంటి ఇబ్బందులు కలగొద్దు... నాణ్యామైన పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని " జిల్లా అదనపు కలెక్టర్ పి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఈ ఏడాది పత్తి సీజన్‌లో సీసీఐ పత్తి కొనుగోళ్ళపై అధికారులతో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. పత్తిరైతులకు పత్తి విక్రయాల్లో ఇబ్బందులు లేకుండా మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. జిల్లాలో ఈ సీజన్‌లో 2లక్షల 25వేల 613 ఎకరాల్లో పత్తి సాగుచేశారని తెలిపారు. వీటిలో 27 లక్షల 7వేల 356 క్వింటాళ్ల పత్తి దిగుబడి అంచనా ఉందన్నారు. ఐదు సీసీఐకేంద్రాలు, 9 జిన్నింగ్ మిల్లుల వద్ద కొనుగోలుకు ప్రతిపాదించినట్లు ఆయన తెలిపారు. నిబంధనల మేరకు పత్తికొనుగోళ్లు చేయాలన్నారు. రైతులు కనీస మద్దతు ధర పొందడానికి ఆధార్ తప్పనిసరి అని అన్నారు. కపాస్ కిసాన్ యాప్‌లో రైతులు నమోద వ్వాలని కోరారు. మద్దతు ధర తేమ శాతం కొనుగోళ్లపై విస్తృత ప్రచారాన్ని నిర్వహించాలని సూచించారు.వ్యవసాయ విస్తరణాధికారులు రైతులకు అవగాహన కల్పించి చైతన్యపరచాలన్నారు ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏఅలీం, సీపీవో శ్రీనివాస్, ఆర్డీవో వెంకటరమణ, సీసీఐ జిల్లా ఇన్‌చార్జి అవినాష్, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి, విద్యుత్‌శాఖ డీఈ రామారావు, మార్కెట్ కార్యదర్శులు , అధికారులు పాల్గొన్నారు.

కేయూ కబడ్డీ విజేత ఖమ్మం

కేయూక్యాంపస్,సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి):కాకతీయ యూనివర్సిటీ కబడ్డీ ఇంటర్ కాలేజీయేట్ పోటీల్లో ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీకళాశాల జట్టు విజయం సాధించింది. రెండు రోజులుగా కేయూ క్రీడామైదానంలో నిర్వహిస్తున్న కబడ్డీ టోర్నమెంట్ తుదిపోటీ శుక్రవారం జరిగింది. పోటీలో హనుమకొండ వాగ్దేవి డిగ్రీకళాశాల జట్టుతో తలపడింది. రెండు పాయింట్ల తేడాతో ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాలజట్టు విజయం సాధించింది. కేయూక్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, వ్యాయమ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్ నేతృత్వంలో పోటీలు నిర్వహించారు.విజేతలకు ట్రోఫీలను అందజేశారు. వారిని అభినందించారు.



జానయ్య చేసిన సేవలు మరువ లేని



జానయ్యకు నివాళులర్పిస్తున్న దృశ్యం

నేలకొండపల్లి,సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): గొర్రెల పెంపకందారుల సంఘం మాజీ అధ్యక్షుడు నోముల జానయ్య ప్రజలకు, గొర్రెల పెంపకందారుల సంఘానికి చేసిన సేవలు మరువలేనివని గొర్రెలు, మేకల సంఘం జిల్లా అధ్యక్షుడుమేకల మల్లిబాబుయాదవ్ అన్నారు. అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందిన జానయ్య మృతదేహానికి అనాసాగరంలోని నివాళులర్పించారు. కార్యక్రమంలో యడ్ల తిరుపారావు, మల్లెబోయిన శ్రీనివాసరావు, బారి మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో

నోముల జానయ్య మృతి పార్టీకి తీరని లోటని టీడీపీమండల నాయకులు సంతాపం ప్రకటించారు. శుక్రవారం జానయ్య మృతదేహన్ని సందర్శించి నివాళులర్పించారు. నాయకులు వీసం శ్రీనివాసరావు, నూక హనుమంతరావు, కోలేటి మస్తాన్‌రావు, మురుకొండ అచ్చయ్య, షేక్.నాగుల్‌మీరా, వీరబాబు తదితరులు నివాళులర్పించి, సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ పడొద్దు

- మేయర్ పునుకొల్లు నీరజ



పనుల నాణ్యతను పరిశీలిస్తున్న మేయర్

ఖమ్మంకార్పొరేషన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పనులు నాణ్యతలో ఇంజనీరింగ్ అధికారులు రాజీ పడొద్దని, పదితరాలు నిలిచిఉండేలా పనుల పర్యవేక్షణ జరపాలని ఖమ్మం నగర పాలక సంస్థ మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మంనగరంలోని డంపింగ్ యార్డు నుంచి మల్లెమడుగు డబుల్ బెడ్ రూమ్ వరకు చేపట్టిన సీసీ రోడ్డు పనులను తనిఖీలు చేశారు. రూ.2కోట్లతో రహదారి మంజూరు జరిగిందని పనుల నాణ్యతను అధికారులు దెగ్గరుంచి పరిశీలించాలన్నారు. నగరంలోని పెట్ పార్క్ పనులను మేయర్ పరిశీలించారు. పెంపుడు జంతువులకు ప్రత్యేకమైన పార్కు ఉండాలనే ఉద్దేశ్యంతో హైదరాబాద్ తరహాలో పెట్ పార్కును ఖమ్మంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. చెర్వుబజార్ విస్తరణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఖమ్మంనగరంలో ప్రధాన రహదారులపై ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు ప్రత్యామ్యాయంగా చెర్వు బజార్ రోడ్డు విస్తరణ చేస్తున్నామన్నారు. ఈఈ కృష్ణలాల్, ఏఈ యాకూబ్ వలీ వెంటున్నారు.

'మెకానిక్స్ అస్సిలేషన్స్' పుస్తకావిష్కరణ

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్ర అధ్యాపకుడు రామిశెట్టి ప్రవీణ్ రచించిన మెకానిక్స్ అస్సిలేషన్స్ అనే పుస్తకాన్ని శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్ బానోతురెడ్డి ఆవిష్కరించారు. ఈ పుస్తకం డిగ్రీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ విద్యార్థులకు బాగా ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు. అధ్యాపకులు జానకిరామ రావు, రమేశ్, రవిశంకర్, బొంద్యాలు, రాంకుమార్, శ్రీనివాసరావు, శైలజ, దీప్తి, సూర్యలక్ష్మి, మల్లేశం, అధ్యాపకేతర సిబ్బంది జానకిరామ్, సత్యనారాయణ, శోభారాణి అభినందించారు.

హాస్టల్ సందర్శన

తిరుమలాయపాలెం, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎంపీడీవో సిలార్ సాహెబ్ అన్నారు. శుక్రవారం తిరుమలాయపాలెంలోని గిరిజన బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. స్టోర్‌రూంలు, రికార్డులు పరిశీలించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈకార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారి పూలన్‌దేవి, జూనియర్‌అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

తిరుమలాయపాలెం, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామీణప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని ఆత్మకమిటీ డైరెక్టర్ ఓర వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం రఘునాథపాలెం నుంచి మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం గుండెపుడి వరకు రూ.2.80కోట్లతో చేపడుతున్న బీటీరోడ్డు పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమంలో నిమ్మల వెంకన్న, జినక ఉపేందర్, వెంకన్న, చంద్రయ్య, సురేష్‌రావు పాల్గొన్నారు .

నేడు పొన్నెకల్‌లో కరెంట్ కోత

కామేపల్లి,సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పొన్నెకల్ సబ్‌స్టేషన్ పరిధిలోని పొన్నెకల్, టౌన్‌ఫీడర్, పొన్నెకల్ లిఫ్ట్ ఫీడర్,బండిపాడుఫీడర్,ఫుల్లూరు ఫీడర్, వీఆర్‌బంజర ఫీడర్ గ్రామాలకు విద్యుత్ సరఫరాను శనివారం నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసులు ఓప్రకటనలో తెలిపారు. మరమ్మతులో భాగంగా శనివారం ఉదయం9 గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

యూరియా అందించడంలో విఫలం

ఖమ్మంరూరల్,సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి):రైతులకు యూరియా అందించడంలో తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ అన్నారు. మండల పరిధిలోని వరంగల్‌క్రాస్ రోడ్డులోని తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో శుక్రవారం రైతుసంఘం మండలకమిటీ సమావేశంలో మాట్లాడారు. ఇటీవల వర్షాలకు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ25వేల పంటనష్టపరిహారం అందించాలనిడిమాండ్ చేశారు.ప్రభుత్వం రైతులకు పూర్తి స్థాయిలో రైతు రుణమాఫీ చేయలేదని వెంటనే అర్హులైన రైతులందరికి రుణమాఫీ చేయాలన్నారు.ఈసమావేశంలో డివిజన్ అధ్యక్షుడు ప్రసాద్, మండలపార్టీ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, సంజీవరెడ్డి,పుల్లయ్య, అప్పారావు పాల్గొన్నారు.

హామీలు అమలుచేయాలి

ఖమ్మంచర్చికాంపౌండ్,సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల సోమయ్య పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఎన్ఎస్‌పీ క్వార్టర్స్‌లో జరిగిన ముఖ్యనాయకుల సమవేశంలో మాట్లాడారు.

భట్టిని కలిసిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు



చింతకాని, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, అమ్మా ఫౌండేషన్ మల్లు నందినిను కలిశారు. ఆయన త్వరలో కాంగ్రెస్‌లో చేరుతారని ఊహాగానాల నేపథ్యంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లుతోపాటు పుల్లయ్య శుక్రవారం భట్టిని కలవడంతో ఊహాగానాలకు త్వరలో తెరపడింది.

యూరియా కోసం భారీగా తరలిన రైతులు

వైరా, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైరాలోని సొసైటీ గోదాముల వద్దకు యూరియా కోసం రైతులు భారీగా తరలివచ్చారు. శుక్రవారం ఈ సొసైటీ గోదాముల్లో 445యూరియా బస్తాలు పంపిణీకి అందుబాటులో ఉండడంతో రైతులు ఒక్కసారిగా ఇక్కడకు చేరుకున్నారు. నెలరోజుల నుంచి యూరియా కోసం పడిగాపులు కాస్తున్నా నేటికీ యూరియా కొరత తీరకపోవడంతో రైతులు ఒక్కసారిగా ఎగబడ్డారు. దాంతో వైరా ఎస్ఐ పి.రామారావు, ట్రైనీ ఎస్ఐ వెంపటి పవన్, ఏవో మయాన్ మంజూఖాన్ యూరియా పంపిణీ కేంద్రం వద్దకు చేరుకొని రైతులతో మాట్లాడారు. ప్రశాంతంగా యూరియా పంపిణీకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దాంతో రైతులు కూడా సాఫీగా యూరియా పంపిణీకి సహకరించారు. తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అక్కడకు చేరుకొని రైతుల సమస్యలను అడిగి తెలుసుకొని వారికి సంఘీభావం తెలిపారు.

యూరియా సరఫరా పెంచాలి

వైరాకు యూరియా సరఫరా పెంచాలని, మార్క్‌ఫెడ్ ద్వారా పెసలు కొనుగోలు చేయాలని, సన్నధాన్యం బోనస్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్, ఏడీఏ కార్యాలయాల ముందు రైతులు ధర్నా నిర్వహించారు. గతనెల 13,14,16తేదీల్లో రైతులు పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఆధార్‌కార్డులు సీరియల్‌లో పెట్టినా నేటికీ యూరియా అందలేదని ఆందోళన వ్యక్తం చేశారు. వైరా కేంద్రంతోపాటు మరో ఏడుచోట్ల యూరియా సరఫరా కేంద్రాలు ఏర్పాటుచేసినప్పటికీ రైతులకు సకాలంలో యూరియా అందడం లేదని ధ్వజమెత్తారు. నెలరోజుల నుంచి యూరియా కోసం ఎదురుచూస్తున్నామని వెంటనే యూరియా సరఫరా పెంచాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, ఏవో మయాన్ మంజూఖాన్‌కు వినతిపత్రాలు సమర్పించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, చింతనిప్పు చలపతిరావు, మండల, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేడా శరాబందీ, మల్లెంపాటి రామమూరావు, నాయకులు పారుపల్లి కృష్ణారావు, పైడిపల్లి సాంబశివరావు, యనమద్ది రామకృష్ణ, తోట నాగేశ్వరరావు, సంక్రాంతి పురుషోత్తం, నర్సయ్య, వడ్లమూడి మధు, పల్లెబోయిన కృష్ణ, సామినేని రవి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రైతులందరికీ యూరియా అందించాలని ధర్నా

పెనుబల్లి: రైతుల కోసమైనా యూరియాను వెంటనే అందించాలని రైతుసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ ఎస్వీ.నారాయణమూర్తికి ఒక వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా నాయకుడు శీలం సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. రైతులు సాగుచేస్తున్న వరిపంటకు పొట్ట దశలో యూరియా వేస్తేనే అధిక దిగుబడులు వస్తాయని, యూరియా సరఫరా చేయకపోతే పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం ఏర్పడుతుందన్నారు. పాస్‌పుస్తకాలతో సంబంధం లేకుండా రైతులందరికి యూరియా అందించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా నాయకుడు చలమాల విఠల్‌రావు, జిల్లా రైతుసంఘం నాయకుడు రావుల రాజబాబు, వ్య.కా.సం నాయకుడు గాయం తిరుపతిరావు, తడికమళ్ల చిరంజీవి, రైతుసంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు చిట్టిమోదుల కృష్ణయ్య, అరుణప్రతాప్ పాల్గొన్నారు.



రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

రైతులకు సరిపడా ఎరువుల పంపిణీ

జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా సహకార సంఘాల ద్వారా ఎరువులను పంపిణీ చేస్తున్నామని జిల్లా వ్యవసాయ అధికారి డీ.పుల్లయ్య అన్నారు. శుక్రవారం ఆయన సత్తుపల్లి మండలంలోని కిష్టారం, తుంబూరు, గంగారం పీఏసీఎస్‌లలో యూరియా పంపిణీ ప్రక్రియను పరిశీలించి రైతువారీ అమ్మకాల ప్రక్రియను తనిఖీ నిర్వహించారు. నత్రజని ఎరువును అవసరం మేరకు వ్యవసాయాధికారుల సిఫారసు అనుసరించి వినియోగించాలని, కొలత మొత్తంలో నానో యూరియా, నానో డీఏపీలను పిచికారీ చేయించుకోవాలని సూచించారు. కిష్టారం, బేతుపల్లి గ్రామాలలో వ్యవసాయ విస్తరణాధికారులు చేస్తున్న పంటల నమోదు ప్రక్రియను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఏడీఏ వీ.శ్రీనివాసరెడ్డి, పట్టణ సీఐ టీ.శ్రీహరి, ఏఓ వై.శ్రీనివాసరావు, ఏఈవోలు నరేష్, ఐ.సాయివాసంతి, ఆశాజ్యోతి పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలను తనిఖీ చేసిన డీఎస్‌వో

ఏన్కూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు రేషన్ దుకాణాలను శుక్రవారం డీఎస్‌వో చందన్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ పంపిణీలో ఎలాంటి లోటుపాట్లు ఇబ్బందులు లేకుండా సక్రమంగా సరఫరా చేయాలని, కొత్త రేషన్ కార్డుదారులకు కూడా రేషన్ ఇవ్వాలన్నారు. రేషన్ పంపిణీలో ఏమైనా సమస్యలుంటే ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబరు 9868200445కు ఫిర్యాదుచేయాలని వైవీఆర్ ఎస్ 14457 ద్వారా వాయిస్‌తో కూడా ఫిర్యాదు చేసే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. సివిల్ సప్లయ్ ఆర్ఐ వీరయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మధిర రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మధిర సీఐ మధు సూచించారు. శుక్రవారం మధిర మండలం సిరిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్, పోక్సో చట్టం, ఐటీ యాక్టుపై పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, పోక్సో చట్టంపై అందరూ అవగాహన కల్గి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ లక్ష్మీభార్గవి, కళాశాల ప్రిన్సిపల్ శాస్త్రీ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండాకు వెలుగులు



విద్యుత్ వెలుగులలోజాతీయ జెండా

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 10వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన 'చిమ్మచీకట్లో 100అడుగుల జాతీయ జెండా' కథనానికి స్పందన వచ్చింది. మునిసిపాలిటీ ఆవరణలో సత్తుపల్లికే తలమానికంగా ఉన్న జాతీయ జెండా ఏర్పాటు చేసిన ప్రాంతంలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ కొండ్రా నరసింహ తెలిపారు. ప్రజలు కూడా పరిసరాలలో చెత్తాచెదారం వేయకుండా శుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని సూచించారు. దీపాలు ఏర్పాటు చేయడంతో కమిషనర్‌కు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

15న తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

తల్లాడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15వతేదీన తల్లాడ తహసీల్దార్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లానాయకుడు కూరపాటి సునిల్‌మాదిగ కోరారు. శుక్రవారం తల్లాడలో వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల ఇన్‌చార్జి యన్నం సీతారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే ఆసరా పింఛన్లు నెలకు వికలాంగులకు రూ.6వేలు, వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళలకు రూ.4వేలకు పెంచుతామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి 21నెలలైనా పెంచకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు. పింఛన్లు పెంపుకోసం మంద కృష్ణమాదిగ నాయకత్వంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈసమావేశంలో ఎంఆర్‌పీఎస్, వీహెచ్‌పీఎస్ నాయకులు ఎక్కిరాల నాగేశ్వరరావుమాదిగ, తేళ్లపుట్ట కృష్ణ, రావూరి కృష్ణ, ఇస్నేపల్లి లక్ష్మణ్, తడికమళ్ల నాగరాజు పాల్గొన్నారు.

17 నుంచి బీజేపీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

తల్లాడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా ఈనెల 17తేదీ నుంచి అక్టోబరు 2వతేదీ వరకు సేవే లక్ష్యంగా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు బీజేపీ మండల కమిటీ అధ్యక్షుడు చల్లా నాగులు శుక్రవారం తెలిపారు. జిల్లా నాయకుడు గాదే కృష్ణారావు, ప్రధాన కార్యదర్శులు పెరికే కిరణ్, రాయల రమేస్, చల్లా నరేష్, ఉపాధ్యక్షుడు గొల్లమండల నరేష్, యద్దనపూడి శ్రీనివాసరావు, తమ్మిశెట్టి కృష్ణ, చౌడా నాగేశ్వరరావు, సంగీతం సాయిచంద్ పాల్గొన్నారు.

మీ బాగు కోసమే తల్లిదండ్రుల కష్టం

» మోటివేషన్ క్లాస్‌లో ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): 'మీరు.. మీ భవిష్యత్తు బావుండాలని మీకోసం కష్టపడేది తల్లీదండ్రులు మాత్రమేనని' అందుకే విద్యార్థులంతా చదువులో రాణించి చూపించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి అన్నారు. శుక్రవారం సత్తుపల్లిలో ప్రైవేట్ విద్యాసంస్థలకు ఇన్‌స్పైర్, ఇగ్నైట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మోటివేషన్ క్లాస్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. తల్లీదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకుల గొప్పతనం తెలుసుకుని తరగతి గదిలో మసలుకోవాలని, అందరం పేదకుటుంబానికి చెందినవారిమేనని, అమ్మానాన్న కూలి పనులకు వెళ్తూ కాయకష్టం చేసి తమకు వలే కష్టపడకూడదని, పిల్లలు ఆనందపడాలనే ఉద్దేశ్యంతో వేలల్లో ఫీజులు కడితే చదవకుండా ఉంటే ఈ జీవితానికి అర్థమే ఉండన్నారు. మంచిమాటలు వినాలంటే చిరాకు పడతామని, ప్రపంచమంతా గుప్పెట్లోనే ఉందని, తమకన్నా గొప్పోళ్లే లేరని భావిస్తే తప్పటడుగు వేయకతప్పదన్నారు. నవమాసాలు మోసీ కనీపెంచిన తల్లీదండ్రుల పేరునిలబెట్టాలని నిజంగా పశ్చత్తాపపడితే విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని, ఇప్పుడు లక్ష్యాల వైపు ముందుకు సాగాలని కోరారు. కల్లూరు ఏసీపీ ఏ.రఘు, మునిసిపల్ కమిషనర్ నరసింహ, నిర్వహకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

'స్థానికం'లో పోటీచేసి గెలుస్తాం: గన్నేని

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో అన్నిస్థానాల్లో పోటీచేసి గెలుస్తామని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గన్నేని రాంప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని కాకర్లపల్లిలో ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అందరూ కలిసికట్టుగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా, పార్టీ అదిష్టానం ఆదేశాలను దిక్కరించినా పార్టీ పరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా మండలంలోనిఅన్ని గ్రామాల్లో పర్యటించనున్నామని, కార్యకర్తలు, అభిమానులు ఆ దిశగా ముందుకు నడవాలని కోరారు. నాయకులు పోట్రు రామారావు, వీరంకి రాంబాబు, నూనె కృష్ణంరాజు, కిలారి వాసు, చింతనిప్పు భాను, గుత్తా వెంకటేశ్వరరావు, కంచర్ల నరసింహారావు, పమ్మి రాము, దోనేష్ పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు సీతారాం ఏచూరి

ముదిగొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ కమ్యూనిస్టు సీతారాం ఏచూరి అని సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం అన్నారు. శుక్రవారం మచ్చా వీరయ్యభవనంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మంకెన దామోదర్, బట్టు రాజు, రాయల శ్రీనివాసరావు, మందరపు వెంకన్న, పద్మ, మెట్టెల సతీష్, భద్రయ్య, పాషా, వెంకట్, భాస్కర్‌రావు, దస్తగిరి పాల్గొన్నారు.

మధిర రూరల్: సీపీఎం పార్టీ జాతీయ నాయకుడు, దివంగత సీతారాం ఏచూరి వర్ధంతి వేడుకలను శుక్రవారం మధిర పట్టణంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సీపీఎం కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు నర్సింహారావు, మందా సైదులు, మురళీ, రాధాకృష్ణ పాల్గొన్నారు.

తల్లాడ: సీపీఎం జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరికి సీపీఎం నాయకులు నివాళులర్పించారు. శుక్రవారం స్థానిక దొడ్డా కృష్ణయ్య భవనంలో సీతారం ఏచూరి ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, నాయకులునల్లమోతు మోహన్‌రావు, చల్లా నాగేశ్వరరావు, షేక్ మస్తాన్, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

'రిటైర్డు ఉద్యోగులకు మనోవేదన'

తల్లాడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రిటైర్డు ఉద్యోగులకు న్యాయంగా రావల్సిన ఆర్థిక ప్రయోజనాలను అందజేయకుండా ప్రభుత్వం మనోవేదనకు గురి చేస్తోందని రిటైర్డు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కళ్యాణం కృష్ణయ్య అన్నారు. శుక్రవారం తల్లాడలోని పెన్షనర్స్ భవన్‌లో మండల శాఖ అధ్యక్షుడు కుంచం రామకృష్ణారావు అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్లకు కాలానుగుణంగా రావాల్సిన కరువు భత్యం, పేరివిజన్ ప్రయోజనాలు కలిపించకుండా కాలయాపన చేస్తున్న ప్రభుత్వ విధానాలపై జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా కార్యదర్శి తాళ్లూరి వేణు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దగ్గుల రఘుపతిరెడ్డి, ఏన్కూరు మండల అధ్యక్షుడు ఆవుల నరసయ్య, వైరా మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణారావు, జయశంకర్, నాయకులు కోటేశ్వరరావు, మేకల అనసూయ, బి.తిరుపతిరెడ్డి, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, షేక్ మున్ని పాల్గొన్నారు. అనంతరం మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా కుంచం రామకృష్ణారావు, ప్రధాన కార్యదర్శిగా మండేపుడి లక్ష్మయ్య ఎన్నికయ్యారు.

ఆలయానికి కల్యాణ సింహాసనం వితరణ

ఏన్కూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గార్లఒడ్డు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శుక్రవారం కళ్యాణ సింహాసనం వితరణగా అందించారు. తల్లాడకు చెందిన విజయలక్ష్మి రైస్ ఇండస్ట్రీస్ బొజ్జ నరసింహారావు, నాగలత దంపతులు రూ.56వేల విలువగల కళ్యాణ సింహాసనం ఆలయానికి అందించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకలు బిట్కూరి నాగరాజాచార్యులు, వేణుగోపాలచార్యుల, కిరణ్‌కుమార్ ఆచార్యులు పాల్గొన్నారు.

ఆయుష, వైద్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరం విజయవంతం

కల్లూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలోని చిన్నకోరుకొండి గ్రామంలో శుక్రవారం ఆయుష్, వైద్యా శాఖ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడిన రోగులను పరీక్షించి ఉచితంగా హోమియో మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరంలో ప్రభుత్వ వైద్యశాఖ తరఫున కూడా వేర్వేరుగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హోమియో వైద్యాధికారి ఎస్‌కె.మారే బాబు, ప్రభుత్వ వైద్యాధికారి సాకేత్‌లు రోగులను వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరాలు సోకితే తమకు సమాచారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా స్థానికంగా చిన్నకోరుకొండి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యోగా విద్యాపై వైద్యాధికారి బి.కృష్ణయ్య అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు కుమ్మరి రామారావు, కె సత్యనారాయణ, చినాల వెంకటేశ్వరరావు, లక్ష్మయ్య, కార్యదర్శి జి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్‌ప్యూరిఫైర్ వితరణ

వేంసూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వేంసూరు మండలం యర్రగుంటపాడు ప్రాథమిక పాఠశాలకు ఆగ్రామానికి చెందిన గాదె వెంకటరెడ్డి దంపతులు కెంట్ వాటర్ ప్యూరీఫైర్‌ను శుక్రవారం వితరణగా అందించారు. కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు రాజశేఖర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు కోసం స్థల పరిశీలన

వైరా, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీలో డంపింగ్‌యార్డు స్థలం కోసం మునిసిపల్ ప్రత్యేక అధికారి, అదనపు కలెక్టర్ పి.శ్రీజ శుక్రవారం పరిశీలించారు. వైరాకు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో తాటిపూడి-ముసలిమడుగు గ్రామాల మధ్య కొత్త ముసలిమడుగులో అందుబాటులో ఉన్న రెండెకరాల స్థలాన్ని ఆమె పరిశీలించారు. తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్ యు.గురులింగం, ఎంపీడీవో సక్రియతో కలిసి ఆ స్థలాన్ని సందర్శించి డంపింగ్ యార్డుకు ఉపయోగపడుతుందా లేదా అని పరిశీలించారు. ఆ స్థలం వైరాకు దూరంగా ఉన్నందున డంపింగ్‌యార్డుకు పనికిరాదని ఆమె స్పష్టం చేశారు. డంపింగ్‌యార్డుకు ఎక్కడెక్కడా స్థలాలు అందుబాటులో ఉన్నాయని తహసీల్దార్‌ను ఆమె ప్రశ్నించారు. గతంలో వైరా రిజర్వాయర్ అలుగుల ముందుభాగంలో తల్లాడ మండలం కొడవటిమెట్ట రెవెన్యూ పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాన్ని డంపింగ్‌యార్డు కోసం గుర్తించారని అయితే అక్కడి దళితులు అడ్డుకోవడంతో ఆప్రక్రియ నిల్చిపోయిందని తహసీల్దార్ వివరించారు. మునిసిపాలిటీ పరిధిలో కొణిజర్ల మండలంలోని పల్లిపాడు, లాలాపురం, దిద్దుపూడిల్లో స్థలాలు అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. సోమవరం, బ్రాహ్మణపల్లి రెవెన్యూ పరిధిలో స్థలాలు లేవని తహసీల్దార్ స్పష్టం చేశారు. వెంటనే మునిసిపాలిటీ పరిధిలోని మ్యాప్ ద్వారా స్థలాలను పరిశీలించిన శ్రీజ కల్లూరు సబ్‌కలెక్టర్, ఖమ్మం ఆర్డీవోలకు ఫోన్ చేసి డంపింగ్‌యార్డు కోసం స్థలాలను పరిశీలించాలని, కలెక్టర్ ఆదేశాలున్నందున వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం నాటికి డంపింగ్‌యార్డు స్థలంపై ప్రతిపాదనలు పంపించాలని తహసీల్దార్ శ్రీనివాసరావును ఆదేశించారు. ఎంపీవో రమాదేవి, గిర్దావర్ నవీన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వీరన్న పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న శ్రీజ

హైవే రోడ్డు అండర్‌పాస్ ఎత్తు పెంచాలని నిరసన

మధిర రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అమరావతి-నాగపూర్ మధ్య నిర్మిస్తోన్న హైవే రహదారిలో మధిర మండలం సిరిపురం ఎండపల్లి గుట్ట వద్ద మిట్టగూడెం రోడ్డులో నిర్మించే హైవే అండర్‌పాస్ ఎత్తు పెంచాలని కోరుతూ శుక్రవారం సిరిపురం గ్రామస్థులు నిరసన తెలిపారు. అండర్‌పాస్ నిర్మించే ప్రదేశం వద్దకు చేరుకొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ చావా వేణు మాట్లాడుతూ.. సిరిపురం నుంచి మిట్టగూడెం మధ్య నిత్యం పెద్ద ఎత్తున రాకపోకలు సాగిస్తుంటారన్నారు. అండర్‌పాస్ చిన్నదిగా నిర్మించటం వల్ల పెద్ద వాహనాల రాకపోకలకు ఇబ్బంది కల్గిస్తుందన్నారు. రైతులు, వ్యాపార వాణిజ్యానికి ఉపయోగపడేవిధంగా అండర్‌పాస్ ఎత్తును పెంచాలని డిమాండ్ చేశారు. సిరిపురం, మిట్టగూడెం గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

అమృత్ పథకంతో.. మార్పు దిశగా మధిర రైల్వే స్టేషన్

మధిర,సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన అమృత్ పథకంతో మధిర రైల్వే స్టేషన్ రూపురేఖలు మారనున్నాయని బీజేపి మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి మధిర రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. మోదీ నాయకత్వంలో దేశ వ్యాప్తంగా రైల్వే స్టేషన్‌లను ఎయిర్‌పోర్ట్ తరహాలో అభివృద్ధి చేస్తున్నారని అన్నారు, మధిరలో కొత్తగా మూడో ప్లాట్‌ఫాం నిర్మాణం, ప్రయాణికుల వెయిటింగ్ హాలు, అదనంగా మరో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలు పూర్తి అయ్యాయని మరో ఆరో నెలల్లో అన్ని పనులు పూర్తి కానున్నాయని అన్నారు. బీజేపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు శివరాజు సుమంత్, గుండా పాపిరెడ్డి, నాయకులు పెరుమాళ్లపల్లి విజయరాజు, చిలివేరు సాంబ, పాపట్ల రమేష్, శ్రీహరి, నాగేశ్వరరావు, కృష్ణారావు, సోమేశ్వరరావు, వేణు, శ్రీను, అర్జునరావు పాల్గొన్నారు.

ప్రభాకర్ సేవలకు తగిన గుర్తింపు

మధిర,సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గత ఆరేళ్లుగా ఇన్‌చార్జ్ ఎంఈవోగానే కాకుండ టీవీఎం పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ప్రభాకర్ సేవలకు గుర్తింపుగా గురుపూజోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డు లభించిందని పీఆర్టీయూ జిల్లా కార్యదర్శి రంగారావు అన్నారు. శుక్రవారం టీవీఎం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయనను పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆరేళ్లుగా పదవ తరగతి పరీక్షలను ప్రభాకర్ విజయవంతంగా నిర్వహిస్తున్నారని అంతే కాకుండా ఉపాధ్యాయల సమస్యలకు తక్షణం స్పందించి తగిన నిర్ణయాలు తీసుకుని పాఠశాలలు సక్రమంగా నడిచేందుకు కృషి చేశారని కొనియాడారు. నాయకులు బ్రహ్మారెడ్డి, రవి కుమార్, శాంతబాబు, సంగారావు, ప్రసాదరావు, కోటేశ్వరరావు, శ్యామలరావు,అనసూయ పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలి

పెనుబల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ హైవే సర్వీస్ రోడ్డు లేకపోవడంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాల్లో సర్వీస్ రోడ్లు నిర్మించాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తకారాయిగూడెంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రైతులు ఆయకట్టు భూములకు వెళ్లేందుకు చిన్న బ్రిడ్జిలు కట్టడం వల్ల వ్యవసాయ పనుల్లో ట్రాక్టర్లు, వరికోత మిషన్లు వెళ్లేందుకు వీల్లేకుండా ఉన్నాయని ఆయన తెలిపారు. సర్వీస్ రోడ్ల కోసం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలకు తెలియజేసి రైతులకు న్యాయం జరిగేలా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. పెనుబల్లి మండల కాంగ్రెస్ నాయకులు కీసర శ్రీనివాసరెడ్డి, పంది వెంకటేశ్వరరావు, సోమరాజు సీతరామారావు, చీకటి నర్సింహారావు, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, దూళిపాళ్ల రాంబాబు, భాస్కర్‌రావు, వంకాయలపాటి పవన్, రైతులు పాల్గొన్నారు.

మట్టి తొలగింపు.. ప్రమాదాల పలకరింపు!

» కుంటలను తలపిస్తున్న గోతులు.. ఛిద్రమవులున్న రోడ్లు

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణంతోపాటు మండలంలో అనుమతులు లేని మట్టితోలకాలతో ప్రమాదాలు పొంచివున్నాయి. మైనింగ్, రెవెన్యూ, పోలీస్, అటవీ శాఖల అనుమతులు లేకుండా యదేచ్ఛగా మట్టి తోలకాలు సాగించడంతోపాటు మట్టి కోసం తీసిన గోతులు కుంటలను తలపిస్తున్నాయి. ముఖ్యంగా రేజర్లతోపాటు కాకర్లపల్లి, గంగారం తదితర గ్రామాలలో మట్టికోసం తీసిన గోతులలో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిండిపోయి ప్రమాదకరంగా మారాయి. ట్రాక్టర్లు, టిప్పర్లు, పుష్పలారీల వారు మితిమీరిన వేగంతో మట్టి తోలకాలు సాగిస్తున్నారని, మట్టిపై పరదాలు కప్పకుండా ఓవర్‌లోడుతో వెళ్తున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. అదే విధంగా రోడ్డుపక్కన ఎక్కడబడితే అక్కడ పార్కింగ్ చేయడంతో పార్కింగ్ సమస్య ఎదురవుతోందని, అర్బన్ పార్క్ ప్రహరీగోడ వద్ద ట్రాక్టర్లు, జేసీబీల నిలపడంతో చెత్తాచెదారంతోపాటు బురదమయంగా మారగా చర్యలు కనిపించలేదని స్థానికులు చెబుతున్నారు. రోడ్లన్నీ ఛిద్రమవుతున్నాయని, పశువులు, మేకలతో పాటు ఇళ్ల సమీపంలో ఉన్న గోతులలో గమనించని చిన్నారులు పడి ప్రాణాలను పోగొట్టుకునే అవకాశం ఉందని, వ్యవసాయ భూములలో కూడా ఇదే పరిస్థితి ఉందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. రేజర్ల వెళ్లే మార్గంలో రోడ్డుపక్కనే భారీగా గోతులు తీయడంతో రాత్రివేళల్లో రోడ్డుపక్కకు వాహనాలు అదుపుతప్పితే ఇక గోతులలో పడి చేతులుకాళ్లు విరగగొట్టుకోవడంతోపాటు ఎవరూ గమనించకపోతే ప్రాణాలు పోయే అవకాశం ఉందని, నిర్వహకులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రహదారి పక్కనే ప్రమాదకరంగా మారిన పెద్దగొయ్యి

నకిలీ వరి విత్తనాలతో రైతులకు నష్టాలు

వేంసూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈ ఖరీఫ్ సీజన్‌లో ముందుగానే వర్షాలు కురవడంతో మండలంలో సుమారు 20వేల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగుచేశారు. కరీంనగర్‌కు చెందిన వరుణ్ అగ్రిటెక్ కంపెనీవారు ఈ విత్తనాలను తమకు సరఫరా చేశారని, ఈ కంపెనీపై చర్యలు తీసుకొని తమకు నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

ఎర్రుపాలెం, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమలాపురం గ్రామంలో జిల్లా నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా పురస్కారం పొందిన వెల్లంకి నాగరాజు, రాజేశ్వరి దంపతులను శుక్రవారం సన్మానించారు. జమలాపురం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా 14 ఏళ్ల సేవలందించి, వినూత్న బోధన ద్వారా ప్రభుత్వ పాఠశాలల ఔన్నత్యాన్ని పెంచేందుకు కృషి చేశారు. ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలెక్టర చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు.

